క్లుప్తంగా

సూపరింటెండెంట్లుగా పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు ప్రోత్సాహం ఇస్తాయని నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదివారం గణేష్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన టి.అబ్దుల్‌వాజిద్, కె.రామకృష్ణకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పదోన్నతి పొందడం ద్వారా విధుల పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. నగరపాలక కార్యాలయానికి వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలు అందించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి

కర్నూలు(సెంట్రల్): క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సీఐటీయూ ఓల్డ్‌సిటీ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం జొహరాపురం మాలగేరి నుంచి కిమ్స్ ఆస్పత్రి వరకు డీవైఎఫ్ఐ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యూబాపై అమెరికా ఆర్థిక, రాజకీయ ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. ప్రపంచ దేశాలన్నీ క్యూబాకు మద్దతుగా నిలవాలని కోరారు. అలాగే పాలస్తీనాపై ఇజ్రాయెల్ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని కోరారు. నాయకులు కృష్ణ, వీరేష్,నాగరాజు, రంగస్వామి, రమణ, మౌలాలి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత నిమజ్జనోత్సవం



కాళీమాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కాళీమాత నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. నరక చతుర్దశిని పురస్కరించుకొని ఓల్డ్ సిటీ కుమ్మరి వీధిలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన కాళీమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి కోలాటాలు, నృత్యాలు చేస్తూ విగ్రహాన్ని ఊరేగించి ఆలయం సమీపంలోని తుంగభద్రా నదిలో నిమజ్జనం చేశారు. అంతకుముందు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం పూజలు నిర్వహించి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. నిర్వాహకులు మధు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో ఆటో నడపడం ద్వారా జీవనోపాధి పొందుతూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ముజఫర్ నగర్‌కు చెందిన కె.గోపాల్ కుటుంబానికి ఆటో యూనియన్ అండగా నిలిచింది. ఈ మేరకు కార్యదర్శులు బి.రాధాకృష్ణ, సుధాకరప్ప ఆదివారం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు మాలిక్‌బాషా, అయ్యస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (న్యూసిటీ): ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం కర్నూలు నగర శివారులోని గాయత్రీ గోశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి భరత్, టీజీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో కొత్తగా పరిశ్రమలు రానున్నాయని తద్వారా యువతకుఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గోమాతకు సేవ చేయడం అంటే తల్లికి సేవ చేసినట్లేనన్నారు. సంస్కృతిక పోటీ కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పారిశ్రామిక వేత్త శివరాజ్, ఆర్యవైశ్య సామాజిక వర్గం ప్రముఖులు పాల్గొన్నారు.

ఇకపై పగటిపూటే తాగునీటి సరఫరా

- కర్నూలు కార్పొరేషన్‌లో 22 ఏళ్లనాటి సమస్యకు మోక్షం
- తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు
- ప్రణాళికలు రూపొందించిన నగరపాలక అధికారులు
- వచ్చే నెల నుంచి కోడుమూరు అర్బన్ పరిధిలో ప్రతిరోజు నీటి సరఫరా



వాల్వ్, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



ఉదయం వేళ నీటిని పట్టుకుంటున్న మోసస్ కాలనీ ప్రజలు

కర్నూలు (టౌన్): కర్నూలు మున్సిపాల్టీని 2002 సంవత్సరంలో కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని విలీనం చేశారు. ఎన్నో గ్రామాలు విలీనం అయ్యాయి. అయితే ఇప్పటివరకు మంచినీటి సరఫరా వేళల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఎంతో మంది పాలకులు వచ్చారు. పాలక వర్గాలు వచ్చాయి. సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. కర్నూలు నియోజకవర్గం పరిధిలో ప్రతి రోజు నగరపాలక యంత్రాంగం తాగునీటిని సరఫరా చేస్తోంది. విలీనం అయినా కల్లూరు గ్రామ పంచాయతీతో పాటు స్టాంటన్‌పురం, మామిదాలపాడు, మునగాలపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం, పందిపాడు గ్రామాలకు మాత్రం రోజు విడిచి రోజు తాగునీటిని సరాఫరా చేస్తున్నారు. అవికూడా సక్రమంగా రాకపోవడంతో శివారు కాలనీల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అర్ధ రాత్రి 1 గంటకు, 2 గంటలకు ఇలా.. అనేక కాలనీల ప్రజలు రాత్రి పడుకోకుండా తాగునీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడేవారు. అయితే పాలకులు, అధికారులు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నగరంలోని కల్లూరు పరిధిలోని 16 వార్డులు, కోడుమూరు అర్బన్ పరిధిలోని 3 వార్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు ఇదే సమస్యపై కౌన్సిల్‌లో లేవనెత్తేవారు. సమస్య పరిష్కరించాలని స్థానిక వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. 133 సచివాలయాల పరిధిలో ఉన్న సివిల్ ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించారు. తాగునీటి సమస్య, పరిష్కారం, వాల్వ్‌లు, నీటి సరఫరాలో ఇబ్బందులు, లీకేజీ సమస్యలను పరిష్కరించే విధంగా సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

సచివాలయ సిబ్బందికే బాధ్యతలు

నగరపాలకలోని 133 సచివాలయాల పరిధిలోని సివిల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు ఇంజినీరింగ్ విభాగంలోని వాటర్ వర్క్స్, రిపేర్లు, నీటి సరఫరా, పార్కుల నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఇలా.. దాదాపు అన్ని పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి మంచి నీటి సరఫరాను పరిశీలించడం, నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపడం, లీకేజీలను అరికట్టడం, స్థానిక కాలనీల ప్రజలతో నేరుగా మాట్లాడటం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. గతంలో వర్కు ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఈ పనులు చేసేవారు. అయితే అవినీతి ఆరోపణలు రావడం, ఇష్టమొచ్చిన సమయంలో నీటిని సరఫరా చేయడం, డబ్బులు తీసుకొని ఎక్కువ సమయం వదలడం, అపార్టుమెంట్లు, వాణిజ్య భవనాలకు మీటర్ కనెక్షన్లు లేకున్నా నీటిని సరఫరా చేయడం, అనధికారిక కుళాయి కనెక్షన్లు ఇవ్వడం ఇలా ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు సైతం పైరవీలు చేయడం, అభివృద్ధి పనులను విస్మరించడం, కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడం, బినామీ ఉద్యోగులను నియమించడం వంటి ఆరోపణలు రావడంతో వీరందరినీ పక్కన పెట్టారు. వారి స్థానంలో సచివాలయాల ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇప్పుడిప్పుడే సమస్యలు గాడిన పడుతున్నాయి.

సంపుల సమస్యకు పరిష్కారం

అనేక కాలనీలలో 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపులను ఏర్పాటు చేసుకొని గంటల కొద్దీ నీటిని మోటార్ల ద్వారా వాడుకుంటున్నారు. కనెక్షన్ ఒకటి ఉంటే ఇంట్లో 4 నుంచి 5 కుళాయిలు ఉంటున్నాయి. ఇలా కొన్ని కాలనీలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని గుర్తించిన అధికారులు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రకారం 100 నుంచి 135 లీటర్ల వరకు నీటిని ఇవ్వాల్సి ఉంది. ఆ లెక్కల ప్రకారం అందరికీ నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించారు.

వచ్చే నెల నుంచి కోడుమూరు అర్బన్‌లో ప్రతిరోజు నీటి సరఫరా

వచ్చే నెల నుంచి కోడూమూరు అర్బన్ పరిధిలోని 38, 39, 40 వార్డులకు ప్రతి రోజు మంచినీటిని సరఫరా చేసే విధంగా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆ దిశగా పనులకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. రెండు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయడం నుంచి ప్రతిరోజు నీటిని సరఫరా చేయడం, పగలు మాత్రమే నీటిని సరఫరా చేయడంపై స్థానిక కాలనీ వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళ తాగునీటి సరఫరాకు చెక్

కార్పొరేషన్ పరిధిలోని అనేక కాలనీలలో రాత్రి వేళల్లో మంచినీటిని సరఫరా చేసేవారు. స్టాంటన్ పురం, వీకర్ సెక్షన్ కాలనీ ఈఎల్ఎస్ఆర్ పరిధిలోని కాలనీలకు రాత్రి, అర్ధరాత్రి 12 గంటలకు, 1 గంటకు ఇలా.. సరఫరా వేళలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలలో 80 శాతానికిపైగా లేబర్ పనులు చేసేవారు ఉన్నారు. వీరంతా అర్ధ రాత్రి మంచినీటిని పట్టుకోవాలంటే ఇబ్బందులు పడేవారు. తెల్లవారుజామున పనులకు వెళ్లాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలకు చెక్ పెడుతూ ఇంజినీరింగ్ అధికారులు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. రాత్రి వేళ నుంచి తప్పించి ఉదయం 5 గంటల నుంచి మంచినీటి సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఈ పనులు పూర్తి చేశారు. రెండు వారాలుగా నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నారు. ఇక నాలుగవ పట్టణ పోలీసుస్టేషన్ ఎదురుగా నిర్మల్ నగర్ నుంచి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని మిస్టర్ ఇడ్లీ వరకు రాత్రి వేళ నీటి సరఫరా నుంచి విముక్తి చేసే చర్యలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఈ కాలనీలన్నింటికీ ఉదయం వేళ మంచినీటిని సరఫరా చేయనున్నారు.

వ్యాయామంతో గుండె పదిలం



డాక్టర్ వసంతకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల గుండె పదిలంగా ఉంటుందని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ అన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో ‘వ్యాయామం–గుండె’ అనే అంశంపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెద్దలతో పాటు యువకుల్లోనూ గుండెజబ్బులు అధికమయ్యాయన్నారు. జీవనశైలిలో మార్పుల కారణంగా మితంలేని ఆహారం తీసుకోవడం, అందులో కొవ్వు, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ శాతం అధికమవుతుందన్నారు. దీనికితోడు ఎక్కువసేపు కూర్చుని చేసే ఉద్యోగాలు, వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిడి కారణంగా గుండెజబ్బులు వస్తున్నాయన్నారు. గుండెజబ్బులు రాకుండా ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, అధిక బరువు తగ్గించుకోవాలని, బీపీ, షుగర్‌ను నియంత్రించుకోవాలని, కొలెస్ట్రాల్ కంట్రోల్‌లో ఉంచుకోవాలని, ధూమ, మద్యపానాలకు దూరంగా ఉండాలని సూచించారు. గుండెజబ్బులు, బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని చెప్పారు. అనంతరం ఆయన్ను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, లక్ష్మన్న తదితరులు సన్మానించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సూచించారు. నగరంలోని రావూరి గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి పేద బలిజ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. బలిజ సంఘం నాయకులు మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యతిథిగా పాల్గొన్న మంత్రి టీజీ భరత్ 170 మంది బలిజ మెరిట్ విద్యార్థులకు రూ.8 లక్షల ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సేవా దృక్పథంతో మరొకరికి చేయూతనివ్వాలని కోరారు. బలిజ సామాజికవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తులసి సీడ్స్ అధినేత రామచంద్ర ప్రభు, రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చింతలపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం



శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన హైందవ శంఖారావం నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత (రాష్ట్ర) కార్యవాహ వేణుగోపాల్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన వివిధ క్షేత్రాల సమావేశంలో శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో హైందర శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలన్న భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం హిందూ సమాజాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రార్థనా స్థలాలు, ఆస్తుల విషయంలో ఇతర మతాలకు స్వేచ్ఛను ఇస్తూ హిందూ దేవాలయాలపై మాత్రం ప్రభుత్వం నియంత్రణ ఉండాలనడం తీవ్రమైన ఆక్షేపణీయమన్నారు. హైందవ శంఖారావంకు అన్ని గ్రామాల నుంచి లక్షలాది హిందూ బంధువులు తరలి రావాలని పిలుపునిచ్చారు. హైందవ శంఖారావం కో-కన్వీనర్ యర్రం విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ సంఘ్ విభాగ్ కార్యవాహ రఘువీర్, జిల్లా సంఘ చాలక్ ఎన్‌వీఎస్ గుప్త, జిల్లా కార్యవాహ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెప్యూటేషన్ పొడిగించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి డెప్యూటేషన్ మరోసారి పొడిగించాలని కోరుతూ కమిషనర్ సొంగ రవీంద్రబాబు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులకు లేఖ రాశారు. గత నెల 15వ తేదీ నాటికి ఆయన డెప్యూటేషన్ గడువు ముగిసిందని పేర్కొన్నారు. 2022 అక్టోబర్ 15న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసేందుకు ఆయన నగరపాలక ఆరోగ్యశాఖ అధికారిగా డెప్యూటేషన్‌పై వచ్చారని, రెండేళ్ల గడువు ముగిసిందని వివరించారు. ఆయన్ను మరో ఏడాది పాటు ఇదేస్థానంలో కొనసాగించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కర్నూలు కార్పొరేషన్‌లో 5 నుంచి 6 లక్షల మంది జనాభా ఉన్నారని, ఇమ్యూనైజేషన్, పారిశుద్ధ్య పనులను నిత్యం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

కర్నూలు(సెంట్రల్): నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ, ఎల్లమ్మ దంపతుల కూతురు మౌనిక (19) అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాకపోవడంతో ఇంటి దగ్గర ఉండేది. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన తరువాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: కర్నూలు గుణంపల్లి పుల్లారెడ్డి ఛారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివి ఎటువంటి ఆర్థిక సహాయం పొందని ప్రతిభ గల ఇంటర్, డిగ్రీ, (ప్రొఫెషనల్ కోర్సులతో సహా) విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను వ్యక్తిగతంగా, పోస్టు ద్వారా స్కాలర్‌షిప్స్ ఆఫ్ జీపీఆర్ ఛారిటీస్ ట్రస్ట్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు, 518007 చిరునామాకు పంపాలని సూచించారు. ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, 2024–25 విద్యా సంవత్సరంతో ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రథమ పరిశీలనలో ఎంపికైన వారు మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

ఆహార భద్రతపై చర్యలేవీ



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ధనార్జనే ధ్యేయంగా పుట్టగొడుగుల్లా రెస్టారెంట్లు, హోటళ్లు పుట్టుకొచ్చాయని, ఏ మాత్రం నాణ్యత, పరిశుభ్రతను పాటించడం లేదన్నారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలను డీప్ ఫ్రీజ్‌లలో నిల్వ చేసి వాటినే వేడి చేసి వినియోగదారులకు వడ్డిస్తున్నారన్నారు. ఆ పదార్థాలను తిన్న వినియోగదారులు రోగాల బారిన పడాల్సి వస్తోందని వాపోయారు. అయినా ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఏ మాత్రం తనిఖీలు చేయడంలేదని, తనిఖీలకు వెళ్లిన వారు హోటళ్ల వారు ఇచ్చే డబ్బులు తీసుకొని మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న, నాయకుడు చంటి పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): డీవైఎఫ్ఐ 44 ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని నగరంలోని 17, 18 వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి వై.నగేష్ హాజరై డీవైఎఫ్ఐ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అజాద్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశ సంపదను కార్పొరేటర్లకు దోచి పడుతున్నారని విమర్శించారు. అలాగే నగరంలోని 34, 32 వార్డుల పరిధిలోని డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హుస్సేన్‌బాష, విజయ్ పాల్గొన్నారు.

రక్తదానం



రక్తాదానం చేస్తున్న యువకులు

కర్నూలు రూరల్ : మండల పరిధిలోని జి. సింగావరం గ్రామంలో ఆదివారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురుస్కరించుకుని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువేంద్ర, గ్రామ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము యువతను ఉద్దేశించి మాట్లాడారు. రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదన్నారు. ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు హుసేనయ్య, డీవైఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు అంజి, దివాకర్, శశి, పెద్దయ్య, కాజా, మల్లేష్, బజారి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



తాండ్రపాడు రాణి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ చెందిన బాలిక అదృశ్యం కావడంపై తల్లిదండ్రులు ఆదివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ తిమ్మారెడ్డి వివరాలను వెల్లడించారు. ఎస్సీ కాలనీలో నివాముండే తాండ్రపాడు హనుమన్న కుమార్తె తాండ్రపాడు రాణి ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో చర్చి వెళ్లి ఉంటుందని భావించిన తల్లిదండ్రులు మధ్యాహ్నం వరకు వేచి చూశారు. అయినా రాకపోవడంతో స్థానికులు, బంధువులను తండ్రి విచారించారు. పదహారేళ్ల బాలిక బయటకు వెళ్లేప్పుడు ఆరెంజ్ కలర్ గౌను, ఎరుపురంగు చున్నీ ధరించి ఉందని ఎస్ఐ చెప్పారు. ఆచూకి తెలిసిన వ్యక్తులు తన నంబర్ 9121101070కు ఫోన్ చేయాలని ఎస్ఐ సూచించారు.

పాముకాటుతో చిన్నారి మృతి



సంధ్య (ఫైల్)

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో పాముకాటుతో ఏడేళ్ల బాలిక మృతి చెందింది. గ్రామస్తుల సమాచారం మేరకు పునరావాస బీసీ కాలనీ గుడిసెలో నివాసముంటున్న వెంకటేష్, మహేశ్వరమ్మ దంపతులకు కుమార్తె సంధ్య (7), కుమారుడు ఉన్నారు. శనివారం రాత్రి భోజనం అనంతరం గుడిసెలో నిద్రిస్తుండగా సంధ్యా చేతిని ఏదో కరిచినట్లు అనిపించడంతో తల్లిదండ్రులకు తెలిపింది. సంధ్యకు గ్రామంలో నాటు వైద్యం చేయించారు. అయితే పాము కరచినచోట నొప్పి ఎక్కువ కావడంతో అర్ధరాత్రి అనంతరం మరో గ్రామంలోని తమ బంధువుల దగ్గర సైతం నాటు వైద్యం చేయించారు. బాలిక పరిస్థితి మిరింత విషమించడంతో ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ వైద్యుడు సూచన మేరకు ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్య బాలిక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గోతి సమీపాన వెళ్తున్న వాహనచోదకుడు

కర్నూలు (రూరల్): కర్నూలు–గుంటూరు ప్రధాన రోడ్డును నంద్యాల చెక్‌పొస్టు నుంచి గార్గేయపురం వరకు సింగిల్ రోడ్డును డబుల్ లైన్‌గా నిర్మిస్తున్నారు. అయితే వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారి ఆలయ సమీపాన రహదారిపై వంతెన సగం నిర్మించారు. మరి కొంత నిర్మించాల్సి ఉంది. వంతెనపై ఉన్న గుంతను పూడ్చలేదు. తాత్కాలిక డివైడర్‌లా ఏర్పాటు చేశారు. అది కూడా కింద పడిపోయి ఉన్నా పట్టించుకునేవారు లేరు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థులు నిత్యం ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురి కావాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బిల్లు పాసైనా అమల్లోకి రావడం లేదని, ఈ విషయాని ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో శారద, సుశీలమ్మ, రేణుక పాల్గొన్నారు.

గోధుమపిండి లారీ బోల్తా

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని డొంగుల వద్ద ఆదివారం తెల్లవారుజామున గోధుమ పిండి లారీ బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి పాండిచ్చేరికి వెళ్తున్న ఈ లారీప్రమాదవశాత్తు డివైడర్ ఎక్కి బొల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గోధుమ పిండి బస్తాలను మరో లారీలోకి లోడ్ చేయించి వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.